విశాలాంధ్ర గోదావరి జిల్లా

కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ

25 నుంచి జిల్లా స్థాయి క్రీడాకారుల ఎంపిక

విశాలాంధ్ర - అనపర్తి : జిల్లాస్థాయి క్రీడాకారుల ఎంపిక తూర్పుగోదావరి జిల్లా గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్ -14, అండర్-17 వాలీబాల్, క్రికెట్, షటిల్, బాల్ బ్యాడ్మింటన్, చదరంగం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్థాయి ఎంపిక ఈనెల 25వ తేదీ నుండి 30 వరకు స్థానిక జిబిఆర్ కళాశాల క్రీడా ప్రాంగణంలో జరగనున్నట్లు బుధవారం జిల్లా స్కూల్ ఫెడరేషన్ కార్యదర్శి ఆర్. నాగ కుమార్ తెలిపారు. 25న అండర్-17,26వ తేదీన అండర్-14, బాలురు, బాలికల విభాగానికి సంబంధించి వాలీబాల్, చదరంగం, షటిల్, బాల్ బ్యాడ్మింటన్ ఎంపిక, 28 అండర్-17 విభాగంలో పురుషుల క్రికెట్ ఎంపిక, 29న అండర్-14 విభాగంలో బాలురు, బాలికల క్రికెట్ ఎంపిక జరుగుతుందని నాగ కుమార్ తెలిపారు. క్రీడాకారుల ఎంపిక కార్యక్రమం ఈనెల 25న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి చేతుల మీదుగా జరుగుతుందని ఈ కార్యక్రమంలో జడ్పిటిసి సత్తి గీతా వరలక్ష్మి, జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్ అబ్రహం, ఉప విద్యాశాఖ అధికారి తిరుమల దాసు, సర్పంచ్ వారా కుమారి, శాప్ డైరెక్టర్లు, వ్యాయామ ఉపాధ్యాయులు, సుమారు 1200 మంది క్రీడాకారులు పాల్గొంటారని ఆర్ నాగ కుమార్ వివరించారు.

నేడు డయల్ యువర్ డిఎం

విశాలాంధ్ర - ఏలేశ్వరం : స్థానిక ఆర్టీసీ డిపోలో గురువారం డయల్ యువర్ డిఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ ఎన్.బాపిరాజు ఒక ప్రకటన తెలిపారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ ప్రయాణికుల సౌకర్యార్థం వారు అందించే సూచనలు, సలహాలను, ఫిర్యాదులను స్వీకరించిన తక్షణ పరిష్కారం కోసం డయల్ యువర్ డిఎం కార్యక్రమాన్ని ఉదయం 10 గంటల నుండి 11 గంటల వరకు 8500954112 నెంబరుకు ఫోన్ చేయవలసిందిగా ఆయన కోరారు. ప్రయాణికుల సంతోషకరమైన వారోత్సవాల్లో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆయన తెలిపారు.

తిరుమలి పాఠశాలలో సైన్స్ ఫెయిర్

విశాలాంధ్ర - ఏలేశ్వరం : మండలంలోని తిరుమలి గ్రామంలో జిల్లా పరిషత్ హైస్కూల్ నందు బుధవారం విద్యార్థులచే సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. సైన్స్ ఫెయిర్‌ను ప్రాథమిక పాఠశాల విద్యార్థిని విద్యార్థులు వీక్షించడం, అవగాహన ఏర్పరచుకున్నారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ఎస్‌జె లక్ష్మణరావు, సైన్స్ ఉపాధ్యాయులు బూర్ల ప్రసాద్, వెంకటరమణ, శేఖర్, ఉపాధ్యాయులు తూమురౌతు శ్రీనివాసరావు, ప్రసాదబాబు, తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల మాటున దోపిడి

విశాలాంధ్ర - రాజోలు : రాష్ట్రంలో సీఎం జగన్ రెడ్డి సంక్షేమ పథకాల మాటున దోచుకోవడం, దాచుకోవడమే తప్ప ప్రజలకు చేసిందేమి లేదని టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బోళ్ళ వెంకట రమణ విమర్శించారు. బుధవారం రాజోలులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ మూడున్నర ఏళ్ల పాలనలో అన్నిరకాల సేవలు, వస్తువుల ధరలు, పన్నుల బాదుడుతో ఒక్క కుటుంబం నుంచి ఏడాదికి సుమారు లక్ష రూపాయలు దోచుకుంటుందని అన్నారు. విద్యుత్, ఆర్టీసీ చార్జీలు, పెట్రోల్, డీజిల్, నిత్యావసర సరుకుల ధరలు పెంచి సామాన్యులపై భారం మోపారని అన్నారు.

సంపూర్ణ పారిశుద్ధ్య నిర్వహణకు ప్రజలు సహకరించాలి

విశాలాంధ్ర - ఆలమూరు : ప్రజలు ఆరోగ్యకరంగా ఉండాలంటే గ్రామ వీధులన్నీ పరిశుభ్రంగా ఉండాలని, సంపూర్ణ పారిశుధ్యం నిర్వహించేందుకు ప్రజల మద్దతు ఉండాలని మండల వైకాపా కన్వీనర్ తమ్మన శ్రీనివాసు అన్నారు. లంక గ్రామాల ముఖ్య కేంద్రమైన చెముడులంకలో పంచాయతీ కార్యదర్శి యు. రేణుక ఆధ్వర్యంలో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు సర్పంచ్ తమ్మన శ్రీనివాసు సమక్షంలో నిర్వహించారు. జాతీయ రహదారి ప్రక్కన వేసిన చెత్తను ప్రత్యేక వాహనాల ద్వారా యుద్ధ ప్రాతిపదికపై బుధవారం బయటకు తరలించారు. గ్రామ విధులు అన్ని పరి శుభ్రంగా ఉంచాలంటూ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు దొండపాటి చంటి, వైకాపా నాయకులు అడబాల వీర్రాజు, మోటూరి సురేష్ దూలం తిరుపతి రావు పలువురు పాల్గొన్నారు.

25న జాబ్‌మేళా

విశాలాంధ్ర - కాకినాడ : 'వికాస' ఆధ్వర్యంలో ఈ నెల 25వ తేదీ శుక్రవారం "కెబికె బయోటెక్ ప్రైవేట్ లిమిటెడ్" కంపెనీలో ఉద్యోగాలకు "వికాస" కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారు. కెబికె బయోటెక్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో ట్రైనీ ఎగ్జిక్యూటివ్, ట్రైనీ టెక్నీషియన్, గ్రాడ్యుయేట్ ఇంజనీర్ ట్రైనీ ఉద్యోగాలకు బి.ఎస్‌సి(ఎంపిసి, బిజెడ్‌సి), ఐటిఐ (ఫిట్టర్, ఎలక్ట్రికల్, ఇనిస్ట్రుమెంటేషన్), డిప్లొమో, బి.టెక్, ఎం.టెక్, (మెకానికల్, ఇసిఇ, ఇనిస్ట్రుమెంటేషన్, ఎలక్ట్రికల్), ఎం.ఎస్‌సి (కెమిస్ట్రీ) 2020, 2021, 2022 సం.ల్లో 60శాతం ఉత్తీర్ణులైన పురుష అభ్యర్థులు అర్హులు. వీరికి నెలకు రూ.10,000 నుండి రూ.15,000 వరకు జీతం ఉంటుంది. ఆరు నెలల తరువాత రూ.25,000 వరకు జీతం ఉంటుంది. ఆసక్తి గల అభ్యర్థులందరూ ఈనెల 25వ తేదీ శుక్రవారం "వికాస కార్యాలయం, కలెక్టరేట్, కాకినాడ" వద్ద ఉదయం 9 గం॥లకు సర్టిఫికెట్స్ జెరాక్స్‌లతో హాజరుకావలెను. మరిన్ని వివరాలకు 8297400666, 8297400777 నంబర్లలో సంప్రదించవలెను. డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.వికాసజాబ్స్.కాం చూడవలను.

అందరికీ అందుబాటులో పాలన

విశాలాంధ్ర - ఆలమూరు : అందరికీ అందుబాటులో ప్రజా పాలన అందించే దిశలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం పనిచేస్తుందని ఆలమూరు ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు అన్నారు. ఆలమూరు మండలం గుమ్మిలేరులో బుధవారం ఎంపీపీ చేతుల మీదుగా పలు ప్రారంభోత్సవాలు నిర్వహించారు. సర్పంచ్ గుణ్ణం రాంబాబు ఆధ్వర్యంలో ఇటీవల నూతనంగా ఏర్పాటు చేసిన పంచాయతీ విశ్రాంతి భవనం, గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన హెల్త్ సెంటర్‌లను ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, సర్పంచ్ గుణ్ణం రాంబాబు, పెదపల్ల పిహెచ్సి వైద్యాధికారి ఆర్ సుదర్శన్ బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ లక్ష్మణరావు మాట్లాడుతూ ఆలమూరు మండలంలో గుమ్మిలేరు అభివృద్ధిలో అగ్రగామిగా నిలిచిందని సర్పంచ్ గుణం రాంబాబు కృషి అభినందనీయులని ఆయన కొనియా డారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ తోరాటి రాంబాబు, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ యనమదల నాగేశ్వరరావు, ఎంపీటీసీ యార్లగడ్డ రమేష్ చౌదరి, కోట బూరయ్య తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ ఫెయిర్

విశాలాంధ్ర - సీతానగరం : ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన సైన్స్‌ఫెయిర్ పలువురిని ఆకట్టుకుంది. మండలంలో సీతానగరం ప్రభుత్వ పువ్వాడ సత్యమాంబ మెమోరియల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. దీనిలో భాగంగా విద్యార్థులు వివిధ రకాల మోడల్స్ తయారు చేసి ప్రదర్శించారు. ఈ ప్రదర్శనలో 5 ప్రాజెక్ట్స్ ఎంపిక చేసి డిసెంబర్ 11,12 తేదీలలో జరిగే మండల స్థాయి సైన్స్ ప్రదర్శనకు పంపించనున్నారు. ఈ ప్రదర్శన పాఠశాల ప్రధానోపాధ్యాయులు పుష్పలత ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో సైన్స్ సమన్వయకర్త కన్నూరి సతీష్ బాబు, సైన్స్ ఉపాధ్యాయులు శ్రీనివాస్, మూర్తి ముస్తఫా, సభిర తదితర ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రబీసాగుకు 30న నీటి విడుదల

తూర్పుగోదావరిజిల్లాలో 71,711 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం : జిల్లాలో రబీ సాగుకు ఈ నెల 30 వ తేదీన కాలువలకు నీటిని విడుదల చేయనున్నట్టు జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచారసంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాల కృష్ణ, హోం మంత్రి తానేటి వనిత పేర్కొన్నారు. బుధవారం స్థానిక జిల్లా కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా నీటి పారుదల సలహా మండలి సమావేశం జిల్లా కలెక్టరు డాక్టర్ కె.మాధవీలత అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాల్, ఎంపీ మార్గాని భరత్ రామ్, ఎంఎల్సీ చిక్కాల రామచంద్రరావు, శాసన సభ్యులు జక్కంపూడి రాజా, జి.శ్రీనివాస నాయుడు, జిల్లా అగ్రి ఎడ్వజరీ బోర్డు చైర్మన్ బూరుగుపల్లి సుబ్బారావు, రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్‌చార్జి మంత్రి వేణుగోపాల కృష్ణ మాట్లాడుతూ రైతు సంక్షేమమే ప్రామాణికంగా భావిస్తూ రాష్ట్రముఖ్యమంత్రి వైఎస్. జగన్మోహన్ రెడ్డి తీసుకున్న నిర్ణయంతో జిల్లాలో ఖరీఫ్ పంటకు జూన్ 1వ తేదీన సాగునీటిని విడుదల చేశారన్నారు. దీని వలన పంటలు ఎటువంటి తుపానులకు గురికాకుండా రక్షించుకోగలిగామన్నారు. ఏడాదిలో మూడు పంటలు పండించాలనే లక్ష్యం కాగా నేడు రెండవ పంట రబీకు ఈ నెల 30 వతేది ధవళేశ్వరం బ్యారేజ్ ద్వారా 71,711 ఎకరాల ఆయకట్టుకు కాలువలకు సాగునీటిని అందిస్తున్నామన్నారు. రాష్ట్ర హోం శాఖ మంత్రి తానేటి వనిత మాట్లాడుతూ రైతులకు సకాలంలో సాగు నీరు, ప్రజలకు త్రాగు నీరు అందించే క్రమంలో, ప్రస్తుత రబీ సీజన్ లో ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి నిర్ణయం ఎంతో మేలు జరుగుతుందన్నారు. జిల్లా కలెక్టరు డాక్టర్ కె.మాధవీలత మాట్లాడుతూ ధవళేశ్వరం బ్యారేజ్ నుంచి నవంబర్ 30 న నీటి విడుదల చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. సాగునీటిని పూర్తి స్థాయి లో రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎంపీ మార్గాని భరత్ రామ్ మాట్లాడుతూ రైతు ఆర్థికాభివృద్ధి కొరకు రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలను అందించడంతో పాటు సకాలంలో సాగునీటిని అందించి రైతుకు అండగా నిలుస్తుందన్నారు. రాజానగరం శాసనసభ్యులు జక్కంపూడి రాజా మాట్లాడుతూ తొర్రిగడ్డ లిఫ్టు ఇరిగేషన్ కింద 1560 ఎకరాలు సాగు జరుగుతుందన్నారు. ఎత్తిపోతల పథకం అభివృద్ధికి రూ.22కోట్లు మంజూరైనా ఇప్పటి వరకు 30శాతం పనులు కూడా జరగలేదన్నారు. ఇరిగేషన్ అధికారులు దీని పై దృష్టి సారించి ఈసీజనల్లో పనులు పూర్తయ్యేలా చూడాలన్నారు. నిడదవోలు శాసనసభ్యులు జి.శ్రీనివాసనాయుడు మాట్లాడుతూ నియోజకవర్గంలో ఖరీఫ్ లో సాగు నీరు సకాలంలో అందించడం వలన పంటలు బాగా పండాయన్నారు. శాసన మండలి సభ్యులు చిక్కాల రామచంద్రరావు, జలవనరుల శాఖ ఎస్ ఈ కె. నరశింహ మూర్తి సభకు వివరిస్తూ రబీ సీజన్లో సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజ్ ద్వారా జిల్లాలో 71,711 ఎకరాల ఆయకట్టుకు నీరు అందిస్తున్నామన్నారు. పిఐపిఎల్ యంసీ సర్కిల్ ఎస్ ఈ బి. ఏసుపాదం, ఈఈ డీపీ రామగోపాల్, కె. విద్యాధరరావు, కొవ్వూరు ఏఎమ్సీ చైర్మన్ వల్లభశెట్టి శ్రీనివాస్, జేడీ వ్యవసాయశాఖ ఎస్. మాధవరావు, జలవనరుల శాఖ డీఈలు, ఏఈలు, ప్రజాప్రతినిధులు, రైతులు, ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

దోష రహిత ఓటర్ల జాబితా రూపకల్పనలో బీఎల్‌వోల పాత్ర కీలకం

విశాలాంధ్ర - కాకినాడ : ప్రజాస్వామ్య వ్యవస్థలో కీలకమైన దోషరహిత ఓటర్ల జాబితాల రూపకల్పన ప్రక్రియలో ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు (ఈఆర్‌వోలు) పటిష్ట ప్రణాళికతో వ్యవహరించాలని జిల్లా ఓటర్ల జాబితా పరిశీలకులు, రాష్ట్ర కళాశాల విద్య కమిషనర్ డాక్టర్ పి.భాస్కర్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ వివేకానంద సమావేశ మందిరంలో జిల్లా ఇన్‌ఛార్జ్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, డీఆర్‌వో కె.శ్రీధర్‌రెడ్డిలతో కలిసి ఓటర్ల జాబితా పరిశీలకులు భాస్కర్. జిల్లాకు సంబంధించి ప్రత్యేక సంక్షిప్త సవరణ (ఎస్ఎస్ఆర్)-2023 కార్యకలాపాలపై ఈఆర్‌వోలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. తొలుత గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల నుంచి అభిప్రాయాలు తెలుసుకున్నారు. సలహాలు, సూచనలు స్వీకరించారు. ఈ సందర్భంగా డాక్టర్ పి.భాస్కర్ మాట్లాడుతూ ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణలో క్షేత్రస్థాయిలోని బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌వోలు) చాలా కీలకమన్నారు. బీఎల్‌వోలు బాధ్యతాయుతంగా, సమర్థవంతంగా, అప్రమత్తతతో పనిచేయడం ద్వారా దోషరహిత ఓటర్ల జాబితాలను రూపొందించవచ్చని పేర్కొన్నారు. సమావేశంలో కాకినాడ, పెద్దాపురం ఆర్‌డీవోలు బీవీ రమణ, జె.సీతారామారావు, కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ కె.రమేష్, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీరమణి తదితరులు హాజరయ్యారు.

ధాన్యం కొనుగోలు సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలి

విశాలాంధ్ర - కపిలేశ్వరపురం ధాన్యం కొనుగోలు సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. స్థానిక మండల పరిషత్తు సమావేశ మందిరంలో ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి దుర్గారావు అధ్యక్షతన బుధవారం మండల సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, డిపిఓ కృష్ణవేణి, జడ్పిటిసి పుట్టపూడి అబ్బు, వైస్ ఎంపీపీ శాఖ శ్రీనివాస్, తాసిల్దార్ సూర్యారావు, ఎంపీడీవో రామకృష్ణారెడ్డి హాజరై మాట్లాడారు. సభ్యులు మాట్లాడుతూ నిడసన మెట్ట సాగునీటి చానల్లో మండపేట మున్సిపాలిటీ పరిధిలోని వాడకం నీరు చేరుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పలు గ్రామాల్లో ఓల్టేజ్ తీగలు వేలాడటం తదితర సమస్యలను సభలో ప్రస్తావించారు. మండలంలోని పాఠశాలలలో జరుగుతున్న నాడు నేడు పనులను విద్యాశాఖ ప్రతినిధులు వివరించారు. ఐసీడిఎస్, ఎన్ఆర్ఈజీఎస్, నీటి పారుదల, డ్రైనేజీ వంటి పలు శాఖల పై సమీక్ష నిర్వహించారు.

పెద్దాపురం నియోజకవర్గ ఏపీయూడబ్ల్యూజే నూతన కమిటీ

విశాలాంధ్ర - పెద్దాపురం : ఏపీయూడబ్ల్యూజే నూతన కమిటీ ఎంపిక ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నాయకులు స్వాతి ప్రసాద్, ఐజేయు రాష్ట్ర నాయకులు మండేలా శ్రీరామ్మూర్తి, రాకుర్తి రాంబాబు పలువురు నాయకుల సమక్షంలో పులిమేరు విభిన్న ప్రతిభావంతుల పాఠశాలలో బుధవారం ఏకగ్రీవంగా ఎంపిక జరిగింది. గౌరవ అధ్యక్షులుగా అడపా వెంకట్రావు (సాక్షి సామర్లకోట), అధ్యక్షుడుగా చవ్వాకుల ఈశ్వరరావు (ఆంధ్రప్రభ, పెద్దాపురం), కార్యదర్శిగా పొలిమాటి విజయ్ కుమార్ (ఈనాడు సామర్లకోట), ఉపాధ్యక్షులుగా బిక్కిన వెంకట్ (రెడ్ బీ న్యూస్ సామర్లకోట), బద్ది కుమార్, (కోస్తా సమయంపెద్దాపురం), ప్రధాన కార్యదర్శిగా ఉప్పలపాటి చంద్ర దాస్ (నేటి రద సారధి, సామర్లకోట), సహాయ కార్యదర్శిలుగా మొల్లు సూర్యనారాయణ (విజయభాను, పెద్దాపురం), గోవిందలపూడి సుబ్రహ్మణ్యం, (మా న్యూస్ సామర్లకోట), కోశాధికారిగా పెమ్మడి వీరభద్ర వర్మ (ఆంధ్రప్రభ, సామర్లకోట), కార్యవర్గ సభ్యులుగా బి బుజ్జిబాబు (వార్త, పెద్దాపురం), ఎలిశెట్టి సత్యనారాయణ, విశాలాంధ్ర సామర్లకోట),ఎం ఆంజనేయ పాల్, (శ్రీ చక్ర పెద్దాపురం), సిద్దిరెడ్డి సూరిబాబు (ప్రజాజ్వాల, సామర్లకోట)లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎంపికైన నూతన కమిటీని పూలమాలలతో సన్మానించారు. ఈ సందర్భంగా స్వాతి ప్రసాద్ మండేలా శ్రీరామ్‌మూర్తి మాట్లాడుతూ నూతన కమిటీ జర్నలిస్ట్ సమస్యల పై పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో స్టేట్ కౌన్సిల్ సభ్యులు అంజిబాబు, ప్రధాన కార్యదర్శి సుంకర ప్రసాద్, జిల్లా కార్యదర్శి వెలిది వెంకటరత్నం, జగ్గంపేట నియోజకవర్గం నాయకులు అడపా వెంకటరావు, కుమార్ పాల్, అడపా శ్రీనివాస్, నియోజకవర్గంలోని పలువురు విలేకరులు పాల్గొన్నారు.

ఆర్ఐ శ్రావణికి రెవిన్యూ సిబ్బంది అభినందనలు

విశాలాంధ్ర - కిర్లంపూడి : కిర్లంపూడి తహసీల్దార్ కార్యాల యంలో ఆర్‌ఐగా పనిచేస్తున్న శ్రావణిని తహసీల్దార్ కేవీ మాధవరావు, రెవిన్యూ సిబ్బంది అభినందించారు. ఆర్‌ఐ శ్రావణికి రీ సర్వే డీటీగా పదోన్నతి వచ్చింది. శ్రావణిని తహసీల్దార్ కేవీ మాధవరావుతో పాటు డిటి ఎం. శ్రీనివాస్, వీఆర్వోలు గుర్రయ్య, ముసలయ్య, నూకరాజు, లక్ష్మి, ఇందిర, అరుణరేఖ, భవాని, ప్రతాప్ పలువురు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల జాతీయ మహాసభలను జయప్రదం చేయండి

26న కార్మిక ప్రదర్శనకు తరలిరండి

జట్లు మేస్త్రీల సమావేశంలో తాటిపాక మధు

విశాలాంధ్ర - రాజమండ్రి : ఈ నెల 26 నుండి 28 వరకు జరుగుతున్న భవన నిర్మాణ కార్మిక సంఘం ఏఐటీయూసీ అనుబంధ జాతీయ మహాసభలు రాజమండ్రిలో జరుగుతున్నాయని 26న జరిగే కార్మిక మహా ప్రదర్శనను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షులు తాటిపాక మధు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక జట్లు సంఘ కార్యాలయంలో యూనియన్ అధ్యక్షులు కుంద్రపు రాంబాబు అధ్యక్షతన సమావేశం జరిగింది. ముందుగా ఇటీవల సీపీఐ జాతీయ మహాసభలో జాతీయ కౌన్సిల్ సభ్యునిగా ఎన్నికైన తాటిపాక మధును యూనియన్ మేస్త్రీలు చిరు సత్కారం చేశారు. అనంతరం మధు మాట్లాడుతూ సాంస్కృతిక కేంద్రమైన రాజమండ్రిలో జాతీయ మహాసభలు జరగటం మంచి పరిణామం అన్నారు. రాష్ట్రంలో జగన్ ప్రభుత్వంలో భవన నిర్మాణ సంక్షేమ రంగాన్ని తూట్లు పడుతున్నాయని అన్నారు. ఇసుక సమస్య పరిష్కారం కావడం లేదని దీనివల్ల నిర్మాణ రంగ కార్మిక వర్గం రోడ్డున పడుతుందని అన్నారు. సీపీఐ నగర కార్యదర్శి వి. కొండలరావు మాట్లాడుతూ 26న జరిగే కార్మిక ప్రదర్శనకు వేలాదిమంది కార్మికులు తరలివచ్చి జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని అన్నారు. దీనికి ఏఐటీయూసీ జాతీయ, రాష్ట్ర నాయకులు హాజరవుతున్నారని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో జట్లు సంఘం ప్రధాన కార్యదర్శి సప్పా రమణ, ఆర్గనైజింగ్ కార్యదర్శి నల్ల రామారావు, అధికార బాడీ సభ్యులు దేవుడు బాబు, ఆర్ వెంకట్రావు, జి. వెంకట్రావు, దుర్గా ప్రసాద్, కాళ్ల అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఏపీయూడబ్ల్యూజే కార్తీక వన సమారాధన

విశాలాంధ్ర - పెద్దాపురం : పెద్దాపురం మండలం పులిమేరు విభిన్న ప్రతిభావంతుల పాఠశాలలో ఏపీయుడబ్ల్యూజే ఆధ్వర్యంలో కార్తీక వన సమారాధన, ఆత్మీయ సమావేశం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఐజెయు సభ్యులు రాకుర్తి రాంబాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏపీయూడబ్ల్యూజే, స్వాతి ప్రసాద్, ఐజేయు రాష్ట్ర నాయకులు మండేలా శ్రీరామమూర్తి, స్టేట్ కౌన్సిల్ సభ్యులు అంజిబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకర్ ప్రసాద్, జిల్లా కార్యదర్శి వెలిది వెంకటరత్నం,పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత రెండు సంవత్సరాలుగా కరోనా కారణంగా సర్వసభ్య సమావేశాలకు దూరంగా ఉన్నామన్నారు. విలేకరుల సమస్యల పరిష్కారానికి ఏపీయూడబ్ల్యూజే, ఐజెయు దశాబ్దాల కాలంగా కృషి చేస్తున్నాయన్నారు.తొలుత సీనియర్ జర్నలిస్టులు మొల్లు సూర్యనారాయణ, అడపా వెంకట్రావులు పతాక ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం విభిన్న ప్రతిభావంతులు విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌పిఎస్ వినాయక్, రాయవరపు వీరబాబు, ఎన్ శ్రీరామ్, నూతటి అశోక్, జగ్గంపేట నియోజకవర్గం నాయకులు అడపా వెంకటరావు, కుమార్ పాల్, అడపా శ్రీనివాస్, యు అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

కొబ్బరిలో సేంద్రీయ వ్యవసాయంపై శిక్షణ



విశాలాంధ్ర - అంబాజీపేట : డాక్టర్ వైయస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం, ఉద్యాన పరిశోధన స్థానం, అంబాజీపేట నందు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ జలవనరుల శాఖ వారు సహకారంతో ఆంధ్రప్రదేశ్ నీటిపారుదల, జీవనోపాధి పథకం (ఎపిఐఎల్ఐపి) ఫేజ్-2 ద్వారా కొబ్బరిలో విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ, నాణ్యత, భరోసా అనే శిక్షణా కార్యక్రమాన్ని 2వ రోజున నవంబర్ 23 తేదీన పరిశోధనా స్థానం అధిపతి డాక్టర్ బి శ్రీనివాసులు పర్యవేక్షణలో క్షేత్రస్థాయి సిబ్బందికి శిక్షణ ఇచ్చేందుకు ఎంపిక చేసిన ఉద్యాన శాఖ అధికారులకు ఫార్మర్స్ సొసైటీ సభ్యులకు వివిధ శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో కొబ్బరిలో సేంద్రియ వ్యవసాయం, కొబ్బరిలో రకాలు ఆధునిక వ్యవసాయ పద్ధతులు, కొబ్బరిలో సమగ్ర కీటక యాజమాన్యం మరియు కొబ్బరిలో సమగ్ర తెగుళ్ళ యాజమాన్యం అనే అంశాలపై డాక్టర్ వైయస్ఆర్‌హెచ్‌యు ఉద్యాన పరిశోధన స్థానం, అంబాజీపేట పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు డా వి గోవర్ధనరావు, బి నీరజ, ఎ కిరీటి, మరియు ఎలియాజర్, జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్, నేచురల్ ఫార్మింగ్ వారిచే శిక్షణా తరగతులు నిర్వహించారు. తదుపరి పరిశోధనా స్థానం అధిపతి డాక్టర్ బి. శ్రీనివాసులు అధ్యక్షతన రైతులు శాస్త్రవేత్తల చర్చా గోష్ఠి నిర్వహించి, కొబ్బరి సాగులో పలు యాజమాన్య పద్ధతులపై సందేహాలు నివృత్తి చేసారు. ఈ కార్యక్రమంలో ఎన్. మల్లిఖార్జునరావు, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఉద్యాన అధికారి వై. సత్యనారాయణ, డియంఐవో సాయి శ్రీనివాస్, ఎపియఫ్‌పియస్ మేనేజర్, సాయెబజాన్, పియంసి టీమ్ లీడర్ భరత్, పిపిఐసి టీమ్ లీడర్ బి రాఘవులు, చైర్మన్, కృషీవల ఫార్మర్స్ సొసైటీ, ఒ టాండన్ రాజు, చైర్మన్, మహిమ ఫార్మర్స్ సొసైటీ, నైనాల వేణుగోపాల్, నారియల్ భారత్ న్యూట్రా సొసైటీ మామిడికుదురు, వరసిద్ధి ఫార్మర్స్ సొసైటీ, అయినవిల్లి, డా బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఉద్యాన అధికారులు, అభ్యుదయ రైతు సోదరులు ఉప్పుగంటి భాస్కరరావు, ముత్యాల జమ్మీలు, అద్దాల గోపాలకృష్ణ, రైతు సోదరులు, ఎపిఐఎల్ఐపి సపోర్ట్ ఆర్గనైజేషం జన కల్యాణ్ వెల్ఫేర్ సొసైటీ ప్రెసిడెంట్ ఎమ్ఎస్ఆర్ కిషోర్, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు సున్నావడ్డీ పంట రుణాలు

విశాలాంధ్ర-రాజవొమ్మంగి : మండలంలో సుమారు 190మంది రైతులకు మూడు లక్షల ఇరవైవేల రూపాయలు సున్నావడ్డి పంట రుణాలు అందిస్తున్నట్లు మండల వ్యవసాయశాఖధికారి రమేష్ నాయుడు తెలిపారు. ఈ సొమ్మును ఈనెల28వ తేదీన వారి ఖాతాలలో వర్చువల్ విధానంలో జమచేయనున్నట్టు తెలిపారు, లక్షరూపాయల లోను తీసుకున్న రైతులు ఆ సొమ్మును తిరిగి సంవత్సర కాలంలో చెల్లిస్తేనే సున్నావడ్డి వర్తిస్తుందని,రుణాలు పొందే రైతుల పేర్లు వ్యవసాయ సహాయకుల ద్వారా ఆయా సచివాలయాల్లో ఉంచామని, ఎవరికైనా సమస్యలుంటే గ్రీవెన్స్ లో తెలియజేయాలని రమేష్ నాయుడు తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం

విశాలాంధ్ర-ఎటపాక : నెల్లిపాక పీహెచ్సీ వైద్యాధికారి డాక్టర్ టి ఎస్ వి ప్రత్యూష నేతృత్వంలో మండలం లోని పురుషోత్త పట్నం సచివాలయం పరిధిలోనున్న దమ్మక్కగూడెంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసారు. ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. మెరుగైన వైద్యం కోసం రిఫర్ చేసారు. అనంతరం మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ లక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ సీతయ్య, ఏఎన్ఎం ఆదిలక్ష్మి, స్థానిక ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నదిలో మునిగి బ్యాంక్ క్యాషియర్ మృతి

విశాలాంధ్ర-చింతూరు : ఛత్తీస్గడ్ రాష్ట్రం సుకుమా జిల్లా కుంట గ్రామంలో ఎస్ బి ఐ బ్యాంకులో క్యాషియర్ గా పనిచేస్తున్న తిరుపతిరావు (30) సోమవారం శబరి నదిలో స్నానానికి వెళ్ళి గల్లంతయ్యాడు. మూడు రోజులుగా వి ఆర్ పురం నుంచి గజ ఈతగాళ్ల ద్వారా గాలింపు చేయగా బుధవారం ఆచూకీ లభించింది. శబరి నీటి ప్రవాహంలో కొట్టుకొని చింతూరు బ్రిడ్జి దగ్గరలో ఆయన మృతదేహం లభించింది. తిరుపతిరావుకు మూడు నెలల క్రితమే వివాహమైంది. స్వస్థలం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని శ్రీకాకుళం జిల్లా వాసిగా తెలిసింది. కుంట పోలీసులు పోస్టుమార్టం నిర్వహించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత అదృశ్యం

విశాలాంధ్ర-రాజవొమ్మంగి : రాజవొమ్మంగి మండలం జడ్డంగి పోలీస్ స్టేషన్ పరిధిలో ఏబీ కోలని గ్రామానికి చెందిన పలివేల వెంకటలక్ష్మి అనే వివాహిత ఈ నెల 21వ తేదీ నుంచి కనిపించడంలేదని కుటుంబీకులు ఫిర్యాదు చేసినట్లు జడ్డంగి ఎస్ఐ షరీఫ్ తెలిపారు. వివరాల్లోకి వెళితే ఈ నెల 21న భర్త,అత్తమామలు పొలం పను లనిమిత్తం ఉదయం వెళ్లి సాయంత్రం వచ్చేసరికి ఆమె ఇంటివద్ద లేకపోవడంతో భర్త పలివేల దావీదు ఆమె తల్లి పల్లపోటీ నాగలక్ష్మి కి ఫోన్ ద్వారా విషయం తెలియజేయగా వారందరు నేటివరకు వెతకగా ఆమె ఆచూకీ తెలియకపోవడంతో వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రాష్ట్ర స్థాయి క్రీడల్లో ఏడుగురాళ్లపల్లి విద్యార్థి ప్రతిభ

విశాలాంధ్ర-చింతూరు : అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం ఏడుగురాళ్లపల్లి స్కూల్లో చదువుకుంటున్న విద్యార్థి ప్రతిభ కనపరిచాడు. ఇటీవల విశాఖపట్నంలో శ్రీ భగవాన్ బిర్స ముండా గిరిజన ఆత్మగౌరవ ఉత్సవాలలో భాగంగా రాష్ట్రస్థాయి క్రీడలు నిర్వహించారు. ఈ క్రీడలలో ఏడుగురాళ్లపల్లి ఆశ్రమ పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థి రవ్వ రమేష్, హై జంప్ లో మొదటి స్థానం, 4 ఇన్ టూ 100 మీటర్స్ రిలే పరుగు పందెంలో తృతీయ స్థానం సాధించాడు. ఆ విద్యార్థిని ప్రధానోపాధ్యాయులు సిహెచ్ రమణ, సీనియర్ ఉపాధ్యాయులు రాంబాబు, వ్యాయామ ఉపాధ్యాయులు ఎస్ ఇంద్రారెడ్డి, డిప్యూటీ వార్డెన్ కె. ముత్తయ్య, కె. భీమయ్య, టి లక్ష్మయ్య ,ఎస్ నాగేశ్వరరావు, శాలువా కప్పి ఘనంగా సత్కరించి అభినందించారు .ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది పాల్గొని అభినందనలు తెలియజేశారు.

దర్షిత్‌కు రెవిన్యూ అధికారుల సహాయం

విశాలాంధ్ర - తాళ్ళపూడి : ఇటీవల హైటెన్షన్ విద్యుత్ వైర్ల కారణంగా ప్రమాదానికి గురైన తాళ్లపూడి మండలం పైడిమెట్ట గ్రామానికి చెందిన జొన్నకూటిదర్షిత్ వైద్య ఆరోగ్య ఖర్చులకు తాళ్లపూడి మండల రెవెన్యూ అధికారులు 50వేల రూపాయలను ఆర్థిక సహాయంగా అందజేసినట్లు వీఆర్వో సంఘం అధ్యక్షులు కావూరి నాగేశ్వరరావు తెలిపారు. తహసీల్దార్ రాధిక , డి టి., ఎండి అహ్మద్ సూచనలతో వీఆర్వోలు సేకరించిన 50వేలను తమ వంతు సహాయంగా బాధిత కుటుంబానికి అందించారు.

అన్ని వర్గాల సంక్షేమానికి కృషి

విశాలాంధ్ర - దేవరపల్లి : అన్ని వర్గాల సంక్షేమం కోస ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అందిస్తున్నారని గోపాలపురం నియోజకవర్గ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు బుధవారం దేవరపల్లిలో దేవరపల్లి వైఎస్ఆర్‌సీపీ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కళా వెంకటరావు మాట్లాడుతూ గోపాలపురం నియోజకవర్గంలో రూ.1500 కోట్లు సంక్షేమ పథకాలు, 500 కోట్ల అభివృద్ధి కార్యక్రమాలు, 300 కోట్లతో ఆర్ అండ్ బి రోడ్లు అభివృద్ధికి కృషి చేసినట్టు తెలిపారు. రెండు మంచినీటి ట్యాంకులు మంజూరయ్యాయని, ఎస్సీ ఎస్టీ మైనార్టీ స్మశాన వాటికల కాంపౌండ్ వాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేసినట్టు తెలిపారు. దేవరపల్లి ఎంపీపీ కేవీకే దుర్గారావు, గోపాలపురం ఏఎంసీ చైర్మన్ జి. జనార్ధన్ రావు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీల్లో కలవలపల్లి విద్యార్థి

విశాలాంధ్ర- చాగల్లు : రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీల్లో మండలంలో కలవలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి మండపాటి రాకేష్ అండర్ 14 బాలుర విభాగంలో ఏలూరులో జరిగిన స్విమ్మింగ్ పోటీల్లో మంచి ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీలకు ఎంపికయ్యాడని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ముత్యాల వీవీఎస్ లక్ష్మీనారాయణ తెలిపారు. కోచింగ్ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు కొయ్య గంగాధర్ రావు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు. ఎస్ ఎం సి సభ్యులు ఆ విద్యార్థిని అభినందించారు.

తెడ్లం, రాజుపోతేపల్లిలో బాదుడే బాదుడు

విశాలాంధ్ర-టి.నరసాపురం: రాష్ట్రంలో పెరిగిన ధరలకు నిరసనగా మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు నాయుడు రామకృష్ణారావు గౌడ్ ఆధ్వర్యంలో తెడ్లం, రాజు పోతే పల్లి గ్రామాల్లో బుధవారం బాదుడే బాదుడు కార్యక్రమం నిర్వహించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అన్ని వర్గాల ప్రజలపై భారం మోపుతూ ప్రజల నడ్డి విరుస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలంటే మళ్ళీ చంద్రబాబు నాయుడుని ముఖ్యమంత్రి చేయాలని తెలిపారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శులు జయవరపు శ్రీరామ్మూర్తి, శీలం వెంకటేశ్వరరావు, ఆచంట సూర్యనారాయణ, ఆచంట అనిల్ కుమార్ ,కొల్లి మురళి, కొండపల్లి రవి,బండి శ్రీను, బొంతు సత్యనారాయణ, పెద్దిన సత్యనారాయణ , కృపాకర్ రెడ్డి శౌరి,తదితరులు పాల్గొన్నారు.

హాస్టళ్లలో వసతుల కల్పనకు ప్రభుత్వం కృషి చేయాలి

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : సంక్షేమ హాస్టల్లో వసతుల మెరుగుదలకు ముఖ్యమంత్రి జగన్ కృషి చేయాలని టీఎన్ఎస్ఎఫ్ ఏలూరు పార్లమెంట్ అధ్యక్షులు పెనుబోయిన మహేష్ యాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలో పరింపుడి గ్రామంలో ఉన్న బాలికల సాంఘిక సంక్షేమ వసతి గృహాన్ని బుధవారం టిఎన్ఎస్ఎఫ్ నాయకులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా మహేష్ యాదవ్ మాట్లాడుతూ వసతి గృహంలో మంచినీరు లేక చేతులు కడుక్కోవడానికి వాడే నీరుని మంచినీరుగా త్రాగాల్సి వస్తుందని, వసతి గృహంలో ఫ్యానులు లేక దోమలు ఎక్కువై అనారోగ్యాలకు గురవుతున్నారన్నారు. బాత్రూంల వద్ద పారిశుద్ధ్యం సరిగా లేకపోవడంతో తీవ్ర దుర్వాసన వెదజల్లుతుందన్నారు. సతి గృహంలో ఉన్న గదులలో కిటికీలకు డోర్లు లేక రాత్రికాల సమయంలో విపరీతమైన చలితో పాటు దోమలు కూడా విజృంభిస్తున్నాయని, దోమతెరలు కూడా లేవని తెలిపారు. విద్యార్థులు ఆడుకోవడానికి ఆటవసువ్తులు ఇవ్వాలని, విద్యార్థులు భోజనం చేయడానికి షెడ్డు నిర్మించాలని కోరారు. వసతి గృహం ఎదురుగా పంచాయతీ డ్రైనేజీ సరిగా లేక వసతి గృహాలు సమస్యలు పుట్టలో దర్శనమిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి పారేపల్లి నరేష్, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మట్టే మణి, జిల్లా అధికార ప్రతినిధి పారేపల్లి పవన్ కుమార్, అధ్యక్షులు టి. రాకేష్, చైతన్య, పవన్, జగత్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కార్తీక మాస ముగింపు ఉత్సవాలు

విశాలాంధ్ర -కైకలూరు : ధర్మాదాయ శాఖ ఏలూరు జిల్లా కైకలూరు మండలం కైకలూరు గ్రామంలో వేం చేసియున్న శ్రీ శ్యామలాంబ అమ్మవారి ఆలయ క్షేత్రంలోని శ్రీరామలింగేశ్వర, శ్రీ రామేశ్వర, శ్రీ కనక లింగేశ్వర స్వామి వార్ల కార్తీక మాస మహోత్స వములు బుధవారంతో ముగిశాయి. స్వామివార్లకు యాగ్నిక బ్రహ్మ శ్రీ లంక ఫణి శర్మ మహాన్యాసం ఏకాదశి రుద్రాభిషేకం రుద్రహోమం తదనంతరం ఉప్పులూరి రాజశేఖర్ దంపతులతో పూర్ణాహుతి కార్యక్రమంతో ముగింపు పలికారు. స్థానిక శ్రీమన్నారాయణ గోష్టి హేమలత బృందం చే మాస శివరాత్రి సందర్భంగా జ్యోతిర్లింగార్చన జరిగింది. ఈ కార్యక్రమంలో శ్రీమన్నారాయణ గోష్టి సభ్యులు భక్తులు పాల్గొన్నారు. కార్తీక మాసం నెల రోజులు ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షులు గుర్రం రాంబాబు , బూరుబోయిన మోహన్ రావు సలహాలు, సూచనలు పై ఆలయ కార్య నిర్వహణ అధికారి పర్యవేక్షణలో ఈ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించినట్టు కార్యనిర్వహణ అధికారి వీఎస్ కే శేఖర్ తెలియజేశారు.

లక్ష పత్రి పూజ

విశాలాంధ్ర - యలమంచిలి : ఇలపకుర్రు శివాలయంలో బుధవారం జరిగిన లక్ష పత్రి పూజ, కుంకుమ పూజ, ప్రత్యేక పూజ కార్యక్రమాలలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ చైర్మన్, పాలకొల్లు నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి కవురు శ్రీనివాస్ పాల్గొన్నారు. స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి కుమార దత్తాత్రేయ వర్మ, పోడూరు జెడ్పీటీసీ గుంటూరి పెద్దిరాజు, పట్టణ అధ్యక్షులు చందక సత్తిబాబు, పోడూరు మండల కన్వీనర్ గణపతి రాజు, డీటీడీసీ బాబు పాల్గొన్నారు.

శేషగిరిరావు పై దాడిచేసిన వ్యక్తి అరెస్టు

విశాలాంధ్ర - కాకినాడ : కాకినాడ జిల్లా, తుని పట్టణంలో ఈనెల 17వ తేదీ గురువారం పోల్నాటి శేషగిరిరావు పై గుర్తుతెలియని, భవాని మాలలో ఉన్న వ్యక్తి కత్తితో దాడి చేసి గాయాలు కలగజేసిన కేసులో నిందితుడు అగ్రహారపు చంద్రశేఖర్, (28)ను పోలీసులు అరెస్టు చేశారు. శాస్త్రీయ పద్ధతులతో పాటు సాంకేతికతను కూడా ఉపయోగించుకుని త్వరితగతిన ఈ కేసులో పురోగతి సాధించారు. సిసి ఫుటేజ్‌లో వచ్చిన ఆధారాల ప్రకారం నిందితుడిని గుర్తించారు. విశాఖపట్నం ఆరిలోవ, పెద్ద గదులు ప్రాంతానికి చెందిన ఒక వ్యక్తి గురువుగా చలామణి అవుతూ ఉంటాడు. ముద్దాయి చంద్రశేఖర్ సదరు గురువు వద్ద శిష్యరికం చేస్తూ మిగతా శిష్యులతో కలిసి ఇతర ప్రాంతాలకు కూడా వెళ్లి పూజలు చేస్తూ ఉంటారు. అలా పూజలు ద్వారా పరిచయమైన అనకాపల్లి జిల్లా నామవరం వాస్తవ్యుడు ప్రస్తుతం పాయకరావుపేటలో ఉంటున్న ఒక రిటైర్డ్ ఉద్యోగి ఖాళీగా ఉంటున్న ఇంట్లో ఉంటూ అప్పుడప్పుడు వచ్చి తుని పాయకరావుపేట నామవరం పరిసర ప్రాంతాల్లో పూజలు చేసి వెళ్తుండేవారు. ముద్దాయి చంద్రశేఖర్‌తో గురువు తుని పట్టణానికి చెందిన పోల్నాటి శేషగిరిరావు అనే వ్యక్తి పై దాడి చెయ్యాలి అని చెప్పి అతనికి డబ్బులు ఇస్తానని చెప్పాడు. గురువుని గట్టిగా నమ్మే చంద్ర శేఖర్ దానికి ఒప్పుకున్నాడు. మిగతా స్నేహితులను కూడా తనతో కలుపు కొన్నాడు. వారి బృందం పోలనాటి శేషగిరి కదలికలు గమనించుకొని వెళ్లారు. తుని సమితి ఆఫీస్ వీధిలో ఉన్న పోలనాటి శేషగిరిరావు ఇంటి లోపల ఆవరణలోనికి వెళ్లి బిక్ష అడిగి, బియ్యం వేస్తుండగా కత్తితో దాడి చేసి చంద్రశేఖర్ పారిపోయాడు. అక్కడే పడిపోయిన కత్తిని పోలనాటి శేషగిరిరావు తీసుకుని వెంటపడి వీధి చివరి వరకు వెళ్లి ముద్దాయి చంద్రశేఖర్ మోటార్ సైకిల్ పై పారిపోతుండగా అదే కత్తితో దాడి చేయగా ముద్దాయికి కూడా వీపుపై రక్తపు గాయం అయ్యింది. పోలీసు వారు తనకోసం పోలీసు బృందాలతో వెతుకున్న విషయం తెలుసుకుని బుధవారం చంద్రశేఖర్ తనకు వేరే దారి లేక తుని టౌన్ పోలీస్ స్టేషన్కు వచ్చి ఈ కేసులో దర్యాప్తు అధికారి ఎస్ మురళీమోహన్ ఎదుట లొంగిపోయాడు.

సచివాలయ వ్యవస్థతో మెరుగైన సేవలు

విశాలాంధ్ర - కాకినాడ : నవరత్న పథకాల ద్వారా అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు అందించడంలో సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు కీలకమని కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. స్థానిక డి కన్వెన్షన్‌లో బుధవారం కాకినాడలోని సచివాలయ కార్యదర్శులు, వాలంటీర్లతో ఎమ్మెల్యే సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతీ ఒక్క లబ్ధిదారునికి సంక్షేమ పథకాలు అందాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభిమతమన్నారు. సీఎం ఆదేశాలకు అనుగుణంగా సచివాలయ వ్యవస్థ మరింత సమర్థవంతంగా పనిచేయాలని కోరారు. ప్రభుత్వ పథకాలతోపాటు కొత్త పింఛన్లకు సంబంధించిన లబ్ధిదారుల ఎంపిక, గృహనిర్మాణం, ఇతర అంశాలపై మరింత బాధ్యతాయుతంగా పనిచేసి ప్రభుత్వానికి మంచిపేరు తేవాలని ఎమ్మెల్యే కోరారు. నవరత్నాలు, పేదలందరికీ ఇళ్లు పథకంలో కాకినాడ నియోజకవర్గ ప్రజల కోసం స్థల కేటాయింపు, మౌలిక సదుపాయాల కోసం రూ.800 కోట్లు వరకు ఖర్చు చేశామన్నారు. గడచిన మూడేళ్ళలో వివిధ ప్రభుత్వ పథకాలు ద్వారా రూ. 630 కోట్లు ప్రజలకు లబ్ధి చేకూరిందన్నారు. ప్రభుత్వం ఇంత పెద్ద ఎత్తున అభివృద్ధి, సంక్షేమాన్ని అమలు చేస్తున్నందున సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు కూడా మరింత సమర్థవంతంగా పనిచేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. నగరపాలక సంస్థ కమిషనర్ కె.రమేష్ మాట్లాడుతూ కాకినాడ కార్పొరేషన్ పరిధిలో దాదాపు 800 మందికి పైగా సచివాలయ ఉద్యోగులు, సుమారు 1900 మంది వాలంటీర్లు ఉన్నారని, వీరంతా ప్రజలకు చేరువగా పథకాల అమలులో క్రియాశీలకంగా వ్యవహరించాలన్నారు. అమ్మ ఒడి, చేదోడు, వాహన మిత్ర వంటి దాదాపు 17 సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందని, ఆయా పథకాలను అర్హులకు అందేలా ఉద్యోగులు మరింత బాధ్యతాయుతంగా పనిచేయాలని కోరారు. అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు మాట్లాడుతూ పథకాల అమలులో ఏమైనా ఇబ్బందులు, సమస్యలు ఉంటే ఆయా డివిజన్లకు కేటాయించిన నోడల్ ఆఫీసర్లు, ప్రత్యేక అధికారుల ద్వారా తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ సమావేశంలో నగరపాలక సంస్థ కార్యదర్శి ఎం ఏసుబాబు, డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, తహసీల్దార్ వైహెచ్ఎస్ సతీష్, ఎంఎస్‌వో మురళీకృష్ణ, ఈఈ ఎం వెంకట్రావు, ఎంహెచ్‌వో డాక్టర్ పృధ్వీచరణ్, టీపీఆర్వో మానే కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

హరిత నగరాల్లో మొక్కలు నాటిన చైర్మన్

విశాలాంధ్ర - అమలాపురం : అమలాపురం పురపాలక సంఘ పరిధిలో జగనన్న హరిత నగరాల్లో భాగంగా బోడసకుర్రు నందు ఉన్న టిడ్కో ఇళ్ల చుట్టూ మొక్కలు నాటే కార్యక్రమం బుధవారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ చైర్మన్ రెడ్డి సత్య నాగేంద్రమణి సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగినది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మెయిన్ బ్రాంచ్ 2000 మొక్కలను, ట్రీ గార్డ్సను అందజేసి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అయ్యప్ప నాయుడు, టౌన్ ప్రెసిడెంట్ సంసాని వెంకట చంద్రశేఖర్, వైస్ చైర్మన్ రుద్రరాజు వెంకటరాజు, వార్డు కౌన్సిలర్ మట్టపర్తి నాగేంద్ర, దొమ్మేటి రాము, కట్టోజు సన్నాయ్యదాసు, చిత్రపు రామకృష్ణ, కొల్లాటి దుర్గాబాయి, గువ్వల రాజేష్, నాయకులు దొంగ చిన్న, గోపి రాజి, యన్నాబత్తుల సాయి, కో ఆప్షన్ సభ్యులు మరియు డిఇఇ అప్పలరాజు, హౌసింగ్ ఏఇ జె సత్యనారాయణ, ఎస్‌బిఐ రీజినల్ మేనేజర్ ఎస్ గుణేశ్వరరావు, అమలాపురం మెయిన్ బ్రాంచ్ చీఫ్ మేనేజర్ బి రమేష్, ఎస్‌వి మురళీకృష్ణ (హెచ్‌ఆర్) తదితరులు పాల్గొన్నారు.

పెంకుటిల్లు కూలి వ్యక్తికి గాయాలు

విశాలాంధ్ర - ఆత్రేయపురం : వాడపల్లి ఎస్సీ కాలనీలో మంగళవారం రాత్రి పెంకుటిల్లు నడి కప్పు కూలి వ్యక్తి తలకు గాయలపాలయ్యాడు. ఎస్సీ కాలనీలో 40 సంవత్సరాలు కలిగిన సుమారు పది పెంకుటిళ్లు ఉండగా వర్షానికి తడిసి ఇంటి వాసాలు శిథిలావస్థలో ఉన్న పందిరి సుశీల ఇంటిపై కప్పు కూలి కుమారుడు పందిరి రాంబాబు నిద్రిస్తున్న సమయంలో తల మీద పడి గాయాలయ్యాయి. ఇబ్బందులలో ఉన్న తన కుటుంబానికి సహాయ సహకారాలు అందించాలని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రతిభా పరీక్షలలో దేవరపల్లి విద్యార్థుల సత్తా

విశాలాంధ్ర - దేవరపల్లి : మన సంస్కృతి నిర్వహించిన రాష్ట్రస్థాయి ప్రతిభా పరీక్షల్లో దేవరపల్లి స్కూల్ విద్యార్థులు సత్తా చాటినట్లు ప్రిన్సిపాల్ పి. పేరయ్య నాయుడు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు ప్రతిభా పరీక్షల్లో పదో తరగతి విద్యార్థిని ముళ్ళపూడి జయ వర్ధిని జిల్లా ప్రథమ స్థానం, హిందీ ప్రతిభ పరీక్షలో ఆరో తరగతి విద్యార్థిని గ్యాలం సత్య నాగ సాహితి ద్వితీయ స్థానం సాధించారని తెలిపారు. హైదరాబాదులో జరిగిన అవార్డుల ప్రధాన ఉత్సవ కార్యక్రమంలో తెలంగాణ మొదటి స్పీకర్ మధుసూదనా చారి ఢిల్లీలో తెలంగా ప్రభుత్వం ప్రత్యేక ప్రతినిధి సముద్రాల వేణుగోపాలా చారి చేతుల మీదుగా జ్ఞాపిక, ప్రశంసా పత్రాలను అందుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా జోనల్ ఇన్‌చార్జి ఎన్. సత్యనారాయణ, ప్రిన్సిపాల్ పేరయ్య నాయుడు సబీనా ఉపాధ్యాయులు తదితరులు అభినందించారు.

చంద్రబాబుతో బండారు భేటీ

విశాలాంధ్ర - కొత్తపేట : మంగళగిరిలో తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబుతో కొత్తపేట నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి బండారు సత్యానందరావు సమావేశ మయ్యారు. నియోజకవర్గ పరిస్థితులను వివరించి, భవిష్యత్తు కార్యాచరణ చర్చించారు. కొత్తపేట నియోజకవర్గ గెలుపు దిశగా కృషి చేస్తానని తెలిపారు. పనితీరు బాగుందని మరింత ఉత్సాహంగా పనిచేయాలని చంద్రబాబు సూచించారు.

కమ్యూనిటీ భవనానికై కన్నబాబుకు వినతి పత్రం

విశాలాంధ్ర - కరప : కరప మండల నాయి బ్రాహ్మణ సేవా సంఘానికి కమ్యూనిటీ హాలు కోసం ఎమ్మెల్యే కురసాల కన్నబాబుకి వినతిపత్రం అందించినట్లు సంఘం నాయకులు తెలిపారు. బుధవారం మండల నాయి బ్రాహ్మణులు కాకినాడలోని రూరల్ వైసీపీ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి తమ సంఘం కార్యక్రమాలు జరుపుకొనుటకు స్థలం మంజూరు చేసి కమ్యూనిటీ హాలు నిర్మించి ఇప్పించవలసిందిగా వినతి పత్రంలో వారు కోరినట్టు తెలిపారు. దీనిపై కురసాల కన్నబాబు సానుకూలంగా స్పందించినట్లు సంఘం నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎం. విష్ణు చక్రం, కే మహేష్, పవన్ కుమార్, పి. నాగేశ్వరరావు, పి.దుర్గారావు, సిహెచ్ వెంకన్న బాబు, ఆర్. రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

23వ డివిజన్‌లో గడగడపకు మన ప్రభుత్వం

విశాలాంధ్ర - కాకినాడ సిటీ : ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి బుధవారం 23వ డివిజన్‌లో గడపగడపకు మన ప్రభుత్వం నిర్వహిం చారు. ఇంటింటికి వెళ్ళి ప్రజా సమస్యలు తెలుసుకుంటూ మూడున్నరేళ్ళ ప్రభుత్వ పాలనలో అందించిన లబ్ధిని ప్రజలకు వివరించారు. కౌడ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తికుమార్, మాజీ మేయర్ సుంకర శివప్రసన్నసాగర్, నగరపాలక సంస్థ కమిషనర్ కే.రమేష్‌తో పాటు పలువురు మాజీ కార్పొరేటర్లు, నాయకులు, అధికారులు ఆయన వెంట ఉన్నారు. ఈ సందర్భంగా ఆ ప్రాంతంలోని ప్రజలు ఎమ్మెల్యే ద్వారంపూడి దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను అక్కడే ఉన్న అధికారులతో మాట్లాడి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ద్వారంపూడి విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు దేశంలోని ఇతర రాష్ట్రాలకు కూడా ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ మీసాలఉదయ్ కుమార్, మాజీ కార్పొరేటర్లు మీసాల శ్రీదేవి,మీసాల దుర్గాప్రసాద్, నల్లబిల్లి సుజాత, సంగాని నందం, కామాడి సీత, మాజీ డిప్యూటీ మేయర్ పసుపులేటి వెంకటలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ ప్రభుత్వాన్ని దీవించండి

విశాలాంధ్ర - తాళ్ళపూడి : పేదల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న జగన్ మోహనరెడ్డి ప్రభుత్వాన్ని మరో సారి దీవించాలని రాష్ట్ర ముఖ్య మంత్రి డాక్టర్ తానేటి వనిత పేర్కొన్నారు. గడప గడప కి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా వేగేశ్వరపురం గ్రామానికి విచ్చేసిన మంత్రి కి సర్పంచ్ కొమ్మిరెడ్డి పరసరామారావు ఆధ్వర్యంలో మహిళలు హారతులు ఇచ్చి స్వాగతం పలికారు. అనంతరం మండల వైకాపా నాయకులు కాకర్ల వెంకటేశ్వరరావు, జెడ్పి వైస్ చైర్మన్ పోసిన శ్రీ లేఖ, ఏ.ఎం.సి వల్లభశెట్టి శ్రీనివాస్, వైకాపా మహిళ నాయకురాలు దమయంతి, ప్రచార కార్యదర్శి నామా ప్రకాశం, శీర్ల బ్రహ్మానందం, కొవ్వూరు, చాగల్లు మండలం నాయకులు తాళ్లపూడి మండల అధికారులు పాల్గొన్నారు.

తాళ్ళపూడిలో భారీ అన్నదానం

విశాలాంధ్ర - తాళ్ళపూడి : మండల కేంద్రమైన తాళ్లపూడి పుష్కర్ ఘాట్ రోడ్డులో వేంచేసి ఉన్న పార్వతి పరమేశ్వర స్వామి, రమా సత్యనారాయణ స్వామి, ఆలయాల ప్రాంగణం లో కార్తీక మాసం సందర్భంగా బ్రహ్మాండమైన అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ప్రతి ఏటా కార్తీకమాసంలో పలు పూజా కార్యక్రమాలు, మాసాంతరంలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించటం ఆనవాయితీగా వస్తోంది. ఈ నేపథ్యంలోనే బుధవారం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సుమారు 3000 మందికి పైగా అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచారక్ పరస రాధాకృష్ణ కార్తీకమాసం సందర్భంగా ఇక్కడ పలు ప్రవచనాలు చేయడంతో పాటు ఈ అన్నదాన కార్యక్రమానికి కూడా ముందుండి, తన వంతు సేవ కార్యక్రమాలు చేపట్టారు.

శివనామస్మరణలతో మారు మ్రోగిన ఉప్పలపాడు

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం ఉప్పలపాడు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయం వద్ద కార్తీక మాసశివరాత్రి సందర్భంగా ఆలయ పురోహితుడు చంద్రమౌళి సుబ్బారావు శర్మ ఆధ్వర్యంలో ఘనంగా స్వామివారికి పూజలు చేసి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయం వద్ద నుండి స్వామివారిని పల్లకిలో ఊరేగిస్తూ, భజనలు చేస్తూ, హర హర మహాదేవ శంభో శంకర అంటూ, మహిళలు జ్ఞాన జ్యోతులతో, కోలాటంతో గ్రామపురవీధులలో నగర సంకీర్తన చేశారు. ఈ సందర్భంగా సుబ్బారావు శర్మ మాట్లాడుతూ గ్రామంలోని ప్రజలందరూ ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో పాడిపంటలతో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో జోశు్యల రాంబాబు, చింతా సుబ్రహ్మణ్య శర్మ, అడబాల భాస్కరరావు, తమటం నాగేంద్ర బాబు, అధిక సంఖ్యలో భక్తులు, మహిళలు పాల్గొన్నారు.

గడప గడపకు మన ప్రభుత్వం

విశాలాంధ్ర - గోపాలపురం : ప్రజల సమస్యలు పరిష్కరించ డానికే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం అని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు తెలిపారు. బుధవారం స్థానిక గోపాల పురంలోని సచివాలయం-3 పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని మండల పార్టీ అధ్యక్షుడు పోతిరెడ్డి నాగరాజు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించి బుక్ లెట్ అందించారు. సచివాలయ ఉద్యోగుల, వలంటీర్ల పనితీరు బాగుందా? అని ప్రజలను నుండి సమాచారం తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఉండవల్లి సత్యనారాయణ జెడ్పీటీసీ సభ్యురాలు కాకులపాటి లలిత, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు కార్యకర్తలు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలులో ఆంక్షలు సడలించాలి

విశాలాంధ్ర - దేవరపల్లి : ప్రభుత్వం ధాన్యం కొనుగోలు విషయంలో కఠిన ఆంక్షలు విధించి రైతులను గందరగోళ పరిస్థితులు కలిగిస్తున్నదని గోపాలపురం మాజీ ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వర రావు విమర్శించారు. మండలంలోని దుద్దుకూరు సర్వీస్ రోడ్డు వద్ద రైతులు చేస్తున్న ఆందోళనకు మద్దతుగా సంఘీభావం తెలిపారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల పట్ల వివక్షత చూపుతోందని అన్నారు. రైతు ప్రభుత్వం అని చెప్పుకుంటూ ప్రభుత్వం ఎప్పుడు రైతులకు వ్యతిరేకంగానే ఉందని అన్నారు. ధాన్యం కొనుగోలులో తేమ శాతాన్ని ఆయుధంగా చేసుకుని రైతులను ఇబ్బందులు పెడుతుందని అన్నారు. వర్షాకాలం పంటలో తేమ ఉంటుందని ఇది గమనించాలని కోరారు. రైతుల వద్ద నుండి సకాలంలో ధాన్యం కొనుగోలు చేసి గిట్టుబాటు ధర కల్పించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపట్టి రైతులకు అండగా ఉంటామని ముప్పిడి వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు నందిన శేషగిరిరావు, కే రవికుమార్, కాకర్ల హరిబాబు దెంగేటి శ్రీనివాస్ ముల్లపూడి పుల్లారావు ముళ్ళపూడి శ్రీనివాస్ కాకర్ల వెంకటేష్, నందిన కృష్ణ, నిమ్మగడ్డ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీ సత్య సాయి 97వ జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర - కాజులూరు : భగవాన్ శ్రీ సత్య సాయి బాబా 97వ జన్మదినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. బుధవారం మండలంలోని గొల్లపాలెం గ్రామంలో శ్రీ సత్య సాయి భజన మండలి వ్యవస్థాపక అధ్యక్షుడు గంటా ధనరాజు ఆధ్వర్యంలో వేకువజాము నుండి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ధనరాజు మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా శ్రీ సత్యసాయి సేవా సంస్థలు అనేక దేశాలలో స్వచ్ఛంద సేవా సంస్థలు స్థాపించి అనేక రకాలైన సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. భగవాన్ శ్రీ సత్య సాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో ఎంతో మందికి ఉన్నత విద్య, అత్యాధునిక వైద్య సేవలను అందిస్తున్నారన్నారు. ప్రతి ఒక్కరూ సేవా దృక్పథంతో ఆపదలో ఉన్న సాటి మనిషికి సహాయపడాలన్నారు. అనంతరం 500 మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వృద్ధులు, అనాథలు, వికలాంగులకు 300 మందికి దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గొల్లపల్లి గంగారావు, త్రిపుర శెట్టి వీరభద్రేశ్వరరావు, ఎల్ఐసి ప్రసాద్, అంగర చిన్న, దాసరి బాబులు, సలాది పుష్పవతి, తదితరులు పాల్గొన్నారు.

నిర్వాసితులకు న్యాయం చేయండి

విశాలాంధ్ర- వి. ఆర్. పురం: అల్లూరి సీతారామరాజు జిల్లా వి ఆర్ పురం మండలం రామవరం పంచాయతీ రామవరం పాడు గ్రామాల ప్రాజెక్టు నిర్వాసితులు రెండు రోజులు నుండి చింతూరు ఐటీడీఏ లో రీలే నిరహార దీక్షలు చేపట్టిన ప్రజలకు సంఘీభావం తెలిపిన, మండలం తెలుగుదేశం పార్టీ జెడ్పీటీసీ వాళ్ల రంగారెడ్డి, కార్యదర్శి బురక కన్నారావు, నాయకులు బొర్రా నరేష్ కుమార్ నిర్వాసితులకు న్యాయం చేయాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2009,2010 సంవత్సరం రామవరంలో ఇప్పుడున్న నివాసిత కుటుంబాలు ఉన్న భూమిని పోలవరం నోటిఫికేషన్ ఇచ్చి లక్ష 15 వేల రూపాయలు నష్టపరిహారం ఇవ్వడం జరిగిందని, ఈ సంవత్సరం నాలుగు సార్లు వచ్చిన వరదలకు రామవరం పంచాయతీ రామవరం పాడు రామవరం గ్రామంలో ఇళ్లు మొత్తం మునిగిపోయాయని తెలిపారు. ఇలాంటి తప్పుడు లెక్కలు చూపి నిర్వాసితులకు అన్యాయం చేస్తే రాబోయే రోజుల్లో ప్రభుత్వానికి ప్రభుత్వ అధికారులకు బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఈ కార్య క్రమంలో మాజీ జెడ్పీటీసీ ముత్యాల రామా రావు, కో ఆప్షన్ సభ్యులు మహమ్మద్ రహీమ్, భాగ్యలక్ష్మి, శ్రీరామ్ గిరి ఉపసర్పంచ్ దుర్గారావు, బీరక సూర్య ప్రకాష్ రావు, బురక సారయ్య, పండ రత్తయ్య, రంగాచారి, బోధ బోయిన సురేష్, ముత్యాల పోసి బాబు, పెట్టా వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వక్స్ బోర్డ్ చైర్మన్‌గా అబ్దుల్ ఖాదర్

విశాలాంధ్ర - అమలాపురం : డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వక్ఫ్‌బోర్డ్ చైర్మన్‌గా అమలాపురానికి చెందిన షేక్ అబ్దుల్ ఖాదర్ నియమితులయ్యారు. ఆయన అమలాపురం పార్లమెంట్ నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షులుగా పని చేశారు. బుధవారం తాడేపల్లిలో వక్స్ రాష్ట్ర చైర్మన్ ఖాదర్ బాషా చేతులు మీదుగా నియమక పత్రాన్ని అందుకున్నారు. తనకి ఈ పదవి రావడం పట్ల రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డికి రుణపడి ఉంటానని అన్నారు. తన పేరుని సిఫారసు చేసిన రాష్ట్ర మంత్ర పినిపే విశ్వరూప్ చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, కోనసీమ జిల్లా ఎంపీకి, ఎమ్మెల్యేలకు, ఎమ్మెల్సీలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఖాదర్ మాట్లాడుతూ మైనార్టీ సంక్షేమానికి వైసీపీ పార్టీ అనేక సంక్షేమ కార్యక్రమాలను పట్టిందని అన్నారు. రానున్న ఎన్నికల్లో వైసిపి పార్టీకి మైనార్టీల మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని అన్నారు. ఖాదర వెంటా వక్స్ జిల్లా కార్యదర్శి జాఫర్ ఉన్నారు. ఈ వక్స్ బోర్డులో పదిమంది వరకు డైరెక్టర్లు ఉంటారు. అమలాపురం పట్టణానికి ఎండి ఆలీషా, కర్రార్ హుస్సేన్, ఆశిక్ మున్నా, రబ్బానీ నలుగురికి సముచిత స్థానం కల్పించారు.

27న విజయవాడలో కాంట్రాక్టు లెక్చరర్స్ రాష్ట్ర సదస్సు

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : ప్రస్తుతం ప్రభుత్వ కళాశాలల్లో గత 22 సంవత్సరాలుగా పనిచేస్తున్న కాంట్రాక్టు లెక్చరర్స్ 12 నెలల కాలానికి పూర్తి రెన్యువల్‌తో పాటుగా, తమ సర్వీస్ రెగ్యులరైజేషనే ఏకైక లక్ష్యంగా ఈ నెల 27న విజయవాడలో రాష్ట్ర స్థాయి సదస్సు ఏర్పాటు చేసినట్టు కాంట్రాక్టు లెక్చరర్స్ అసోసియేషన్ ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా అధ్యక్షుడు గొర్ల మాణిక్యం విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ రాష్ట్ర సదస్సుకి అన్ని ఉద్యోగసంఘాల నాయకులు, సామాజిక వేత్తలు, మేధావులు, అధికార, ప్రతిపక్ష రాజకీయ పార్టీలకు చెందిన నేతలందరూ పెద్ద స్థాయిలో హాజరవ్వడమే కాకుండా జాతీయ, రాష్ట్ర నాయకులు కొప్పిశెట్టి సురేష్,రామచంద్రారెడ్డి, కురుమూర్తి, బిజె గాంధీ, శర్మ తదితరులతో పాటుగా పెద్ద ఎత్తున కాంట్రాక్టు లెక్చరర్స్ కూడా పాల్గొంటారని తెలిపారు. ప్రజా సంకల్ప యాత్ర ఇచ్చిన వాగ్దానం మేరకు కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులరైజేషన్ హామీని ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చారన్నారు. అయితే అధికారంలోకి వచ్చి మూడున్నరేళ్లు గడుస్తున్నా కమిటీల పేరుతో కాలయాపన చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఒకవైపు తెలంగాణలో కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులర్ చేయడం జరిగిందన్నారు. అంతేగాకుండా ఒడిస్సా, పంజాబ్, రాజస్థాన్, తమిళనాడు తదితర రాష్ట్రాల్లో కాంట్రాక్టు ఉద్యోగులని రెగ్యులర్ చేయడం జరిగిందని తెలిపారు. ఎన్నికలకు మరో ఏడాదిన్నర మాత్రమే సమయం ఉన్నందున త్వరితగతిని రెగ్యులరైజేషన్ ప్రక్రియ ప్రారంభించి పూర్తి చేయాలని సీఎం జగన్‌ని కోరారు. గత ప్రభుత్వాలు హామీ ఇచ్చి అన్యాయం చేశాయని వాపోయారు. ఈ ప్రభుత్వ హయాంలో ఖచ్చితంగా జరుగుతుందన్న నమ్మకంతో ఉన్నామని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా నాయకులు పెనుమాల రామకృష్ణ, యు లక్ష్మణ్, మచ్చర్ల శ్రీనివాసరావు, పాలపర్తి కుమార్ రాజా, మురుకుర్తి సత్యనారాయణ, డి మోహన్, పి మంగతయారు తదితరులు పాల్గొన్నారు.

విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలు

విశాలాంధ్ర - కరప : కరప నక్క సూర్యనారాయణ మూర్తి జడ్పీ హైస్కూల్ నందు జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశాల మేరకు విద్య వైజ్ఞానిక ప్రదర్శనను నిర్వహించినట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయులు యు. లీలా మనోహర్ పేర్కొన్నారు. విద్యార్థినీ విద్యార్థులతో వైజ్ఞానిక ప్రదర్శనలను నిర్వహించి వారికి బహుమతులు ప్రదానం చేయడం జరిగిందని ప్రధానోపాధ్యాయులు మనోహర్ పేర్కొన్నారు. ఈ బహుమతులను గ్రామ సర్పంచ్ ఎస్ ఆశాజ్యోతి, స్కూల్ చైర్మన్ శ్రీపాదం రమాదేవి, జాస్మిన్, మురళి బాబు, సుదర్శన్, కృష్ణవేణి, సుధాకర్ బాబు, రాజేశ్వరి, శ్రీరామచంద్రమూర్తి, సుబ్రహ్మణ్యం, తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.